ప్రజాశక్తి
గురువారం 30 నవంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

1న ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

డిసెంబరు ఒకటో తేదిన ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పించుటకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయం నుండి ఎన్‌జిఒ హోం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ర్యాలీలో స్వచ్ఛంద సంస్థలు, పాజిటివ్ నెట్ వర్క్స్ ప్రతినిధులు, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ సభ్యులు, యువత పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని భాస్కరరావు తెలియజేశారు.

సకాలంలో వైద్యమందక.. మహిళ మృతి

మృతిచెందిన నీలాపు నాగమ్మ

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమన్న బంధువులు
- డ్యూటీ డాక్టర్ లేరని ఆరోపణలు
- ఏరియా ఆసుపత్రి సిబ్బందిపై దాడి

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు ఏరియా ఆసుపత్రిలో సకాలంలో వైద్యం అందక ఓ మహిళ మృతి చెందింది. బుధవారం తెల్లవారు జామున 4.50 గంటలకు పట్టణంలోని దాసరి వీధికి నీలాపు నాగమ్మ (49)ని ఆమె కుటుంబ సభ్యులు ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. నాగమ్మ ఆయాసంతో బాధపడుతోందని ఆసుపత్రిలో చేర్పించారు. ఆ సమయంలో డ్యూటీ డాక్టర్ లేకపోవడంతో నర్సింగ్ సిబ్బంది వైద్యం అందించారు. సెలైన్ బాటిల్ ఎక్కించారు. నాగమ్మని ముందు జనరల్ వార్డులో చేర్చారు. సిబ్బంది చేసిన వైద్యం ఫలించకపోవడంతో రౌండ్‌కి వచ్చిన డాక్టర్ తిరుమలాదేవి.. నాగమ్మను క్యాజువాలిటీ వార్డుకు తరలించాలని సూచించారు. అక్కడ కూడా ఉదయం 9.15 గంటలకు డాక్టర్ శాంతిప్రియ వైద్యం ప్రారంభించారు. అప్పటికే సరైన వైద్యం అందకపోవడంతో డాక్టర్ శాంతిప్రియ చేసిన చికిత్సకు నాగమ్మ ఆరోగ్యం మెరుగు పడలేదు. దీంతో ఉదయం పది గంటల సమయంలో ఆమె మృతి చెందారని డాక్టర్ శాంతిప్రియ నిర్ధారించారు. దీంతో మృతురాలి బంధువుల కోపం కట్టలు తెంచుకుంది. వైద్యం అందించిన డాక్టర్ శాంతిప్రియపై నాగమ్మ కుటుంబ సభ్యుల ఆగ్రహంతో ఊగిపోయారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఎంఎన్‌ఒ మోహన్ వంశీ, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ ఎస్.వెంకటరమణపై నాగమ్మ కుటుంబ సభ్యులు దాడికి దిగారు. దీంతో వెంటనే వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. టౌన్ ఎస్‌ఐలు నర్సింహమూర్తి, భాస్కరరావు అక్కడకు చేరుకుని ఉద్రిక్త పరిస్థితులను సద్దుమణిగేలా చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్ల నాగమ్మ మృతి చెందిందని పోలీసులతో వాదించారు. బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 5 గంటలు ఆలస్యంగా వైద్యం ప్రారంభించారని, అందువల్లే నాగమ్మ మరణించారని ఆమె బంధువు లక్ష్మి విలేకరులకు చెప్పారు. ఏరియా ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ లేకపోవడమేమిటని ప్రశ్నించారు. నాగమ్మని ఆసుపత్రికి తీసుకొచ్చిన వెంటనే సరైన వైద్యం అందిస్తే బతికి ఉండేదని బంధువులు వాపోయారు.

వైద్యం అందించాం

- ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ గోపాలరావు

నాగమ్మకు సకాలంలో వైద్యం అందించాం. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో జనరల్ వార్డు నుంచి క్యాజువాలిటీకి తరలించాం. డాక్టర్ శాంతి ప్రియ వైద్యం చేశారు.

చర్యలు తీసుకోవాలి

- సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి

ఏరియా ఆసుపత్రిలో బుధవారం విధినిర్వహణలో వున్న వైద్య సిబ్బందిపై దాడికి పాల్పడిన నీలాపు నాగమ్మ బంధువులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాం. నాగమ్మకు అందించిన వైద్యం, దాడికి పాల్పడిన సిసి ఫుటేజీ అందజేశాం.

ఉదయం 9.15కి వైద్యం ప్రారంభించా

- డాక్టర్ శాంతి ప్రియ

ఆసుపత్రిలో ఒపి విభాగం నుంచి ఉదయం 9.15 గంటలకు నాగమ్మకు చికిత్స ప్రారంభించాను. ఫ్లూయిడ్స్ ఇచ్చాం. నెబ్యులైజర్ పెట్టాం. ఆమెని బతికించడానికి శాయశక్తులా కృషి చేశాను. ఒక దశలో మృతురాలి బంధువులు నాపై దాడికి ప్రయత్నించారు. ఆవేశంతో నర్సింగ్ సిబ్బందిపై దాడికి దిగారు.

డ్యూటీ డాక్టర్ ఎక్కడికెళ్లారు?

ఏరియా ఆసుపత్రి.. వంద పడకల స్థాయికి రూపాంతరం చెందిన పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది, ఇతర విభాగాలకు సిబ్బందిని నియమించారు. 24 గంటలూ వైద్య సేవలు, అత్యవసర పరిస్థితుల్లోనూ వైద్యం అందేలా ఇక్కడ సౌకర్యాలు కల్పించారు. డ్యూటీ డాక్టర్ ఉదయం 9 గంటల నుంచి మరుసటిరోజు ఉదయం 9 గంటల వరకు విధినిర్వహణలో ఉండాలి. తరువాతి రోజు వీరికి సెలవు. ఇక్కడ డ్యూటీ డాక్టర్ సాయి బుధవారం తెల్లవారు జామున ఉదయం 4.50 గంటలకు నాగమ్మను తీసుకొచ్చే సమయానికి లేరని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఆయన ఉంటే నాగమ్మకు సకాలంలో వైద్యం అందేది. నాగమ్మను ఆసుపత్రికి తీసుకొచ్చిన సమయానికి డ్యూటీ డాక్టర్ సాయి లేరనే విషయాన్ని మిగిలిన వైద్యులు మరుగున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. డ్యూటీలో ఉన్నారనే విషయాన్ని కరాఖండిగా ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాలరావు కూడా చెప్పలేక నీళ్లు నములుతున్న పరిస్థితి కనిపించింది.

పోలీసులను నిలదీస్తున్న నాగమ్మ బంధువులు

దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు

ముగిసిన ఎస్‌ఎఫ్‌ఐ దీక్షలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం ముగిశాయి. ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద ప్రారంభించిన దీక్షలు ఆరు రోజులపాటు సాగాయి. ఈ దీక్షలకు రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశంలో విద్యార్థులు సమస్యలతో బాధపడుతుండడం చాలా అన్యాయమన్నారు. వెంటనే అటువంటి స్థానిక సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యాలయాలు, వైద్యశాలలు, పరిశ్రమలు సంపూర్ణంగా ఉంటేనే ఏ ప్రాంతమైనా, దేశమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా విద్యారంగ అభివృద్ధికి విద్యార్థులు చేస్తున్న పోరాటానికి రెడ్‌క్రాస్ నుంచి సహకారం ఉంటుందన్నారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని గురువారం చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కె.రాజు, ఉమాశంకర్, వరుణ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో కలెక్టరేట్

వరికోతలు వాయిదా వేయాలి

ప్రజాశక్తి-పాచిపెంట

తుపాను ముప్పు పొంచి ఉండటంతో వరి కోత వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోసిన వారు కుప్పలు వేయాలని ఎఒ కె.తిరుపతిరావు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆరో తేది వరకు వరికోతలు వాయిదా వేయాలని రైతులను కోరారు. ఈ సంవత్సరం నీటి సదుపాయం ఉన్నచోట ఎంటియు 1121, 1064 రకాల దిగుబడి బాగుందన్నారు. ఆర్‌జిఎల్ 2537 రకానికి కొద్దిగా తెగుళ్లు వచ్చాయని తెలిపారు. బిపిటి 5204 రకం దిగుబడి గత సంవత్సరంతో పోలిస్తే ఒక బస్తా తక్కువగా వచ్చిందన్నారు. మండలంలో వరిలో దాదాపు సాధారణ దిగుబడులే నమోదు అవుతున్నాయని వెల్లడించారు. ఈ ఏడాది పత్తి పంట దిగుబడి బాగుందని, ప్రభుత్వ మద్దతుధర రూ.7020 ఉందని చెప్పారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ నాయకులు మోహన్ పాల్గొన్నారు.

స్వపక్షంలో విపక్షం

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి కౌన్సిలర్ శ్రీదేవి

- చైర్‌పర్సన్ తీరుపై అధికార పార్టీ కౌన్సిలర్ల అసంతృప్తి
- సమావేశం నుండి టిడిపి కౌన్సిలర్లు వాకౌట్

ఓ వైపు అజెండాలోని అంశాలను మున్సిపల్ ఉద్యోగి చదవడం ప్రారంభించారు. తొలి అంశం పూర్తికాకముందే, ప్రతిపక్ష కౌన్సిలర్లు అడ్డుతగలడం, సమావేశాల్లో ఎన్నిసార్లు సమస్యలు లేవనెత్తినా పరిష్కారం కావడం లేదని అసంతృప్తి వ్యక్తంచేయడం, వాకౌట్ చేయడం జరిగిపోయాయి. మిగతా అంశాలను చదువుతుండగానే.. అధికార పార్టీ సభ్యులు బల్లగుద్ది మరీ ఆమోదం తెలపడం.. వెంటనే బయటకెళ్లిపోవడం ప్రారంభమయ్యాయి. సమావేశం ప్రారంభించి, గంట కూడా కాలేదు.., ఇంతలో సమావేశమందిరం ఖాళీ అవుతుండటంతో ఆశ్చర్యపోవడం చైర్‌పర్సన్ వంతైంది. ఆమె తేరుకుని సర్దిచెప్పడానికి ప్రయత్నించగా, అధికార పార్టీ సభ్యుల నుంచే నిలదీతలు, అసహనాలు వ్యక్తమయ్యాయి. వీటన్నింటికి బుధవారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశం వేదికైంది.

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం ఏర్పాటుచేశారు. మున్సిపల్ ఉద్యోగి అజెండాలో పొందుపరిచిన 29 అంశాలను చదవడం ప్రారంభించారు. తొలుత పాత బస్టాండ్ కూడలి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు డివైడర్‌ను రూ.4.98 లక్షలతో అభివృద్ధి చేసేందుకు కౌన్సిల్ ఆమోదం కోసం తెలియజేయగా, టిడిపి కౌన్సిలర్లు అడ్డుతగిలారు. టిడిపి కౌన్సిలర్ ద్వారపురెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ డివైడర్‌పై ఉన్న మొక్కల వల్ల ఎవరికీ ఇబ్బంది లేదన్నారు. కనీసం స్వపక్ష, విపక్ష కౌన్సిల్ సభ్యులతో చర్చించకుండా, కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఆదరాబాదరాగా డివైడర్‌పై ఉన్న మొక్కలను తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. వార్డులలో చాలా సమస్యలు ఉన్నాయని, ఆ నిధులతో సమస్యలు పరిష్కరించవచ్చని సూచించారు. బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని చాలా సమావేశాల నుంచి చెబుతున్నా వాటిని ఇప్పటికీ ఏర్పాటు చేయడం లేదని 8వ వార్డు టిడిపి కౌన్సిలర్ కోరాడ నారాయణరావు నిలదీశారు. అనంతరం సమావేశాల వల్ల ఉపయోగం ఉండటం లేదని టిడిపి కౌన్సిల్ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోయారు.

అనంతరం ఎజెండాలోని అంశాలను చదివి వినిపిస్తుండగా, అన్ని అంశాలకూ తమకు అభ్యంతరం లేదని అధికార పార్టీ సభ్యులు ఆమోదం తెలిపి, చాలామంది సమావేశం నుంచి వెనుదిరిగారు. ఈ హఠాత్ పరిణామానికి చైర్‌పర్సన్ ఆశ్చర్యానికి గురై బెల్ కొట్టకుండానే, టేబుల్ అజెండాను ఆమోదించకుండానే సమావేశం నుండి బయటకు వెళ్లిపోవడం ఏమిటని ప్రశ్నించారు. సభలో చాలామంది సీనియర్ సభ్యులు ఉన్నారని, ఈ విషయం తెలియకపోవడం ఏమిటని అసహనం వ్యక్తంచేశారు. నెలకోసారి సమావేశానికి వచ్చిన అధికారపక్ష కౌన్సిలర్లు గంటసేపు సమావేశ మందిరంలో ఉండలేకపోవడం చాలా బాధాకరమన్నారు. దీంతో కొందరు అధికార పార్టీ కౌన్సిలర్లు మాట్లాడుతూ ఈ రెండున్నర ఏళ్ల తమకు అవమానాలే ఎక్కువగా జరిగాయని అసంతృప్తి వెల్లగక్కారు. డివైడర్‌పై మొక్కలను నాటినప్పుడు తమను పిలవకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండా మొక్కుబడిగా కార్యక్రమం చేపట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకు తెలియకుండానే, భాగస్వామ్యం చేయకుండానే చాలా సందర్భాలలో మీతోపాటు మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారని నిలదీశారు.

సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేష్, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, డిఇ కిరణ్ కుమార్, ఆర్‌ఒ రూబెన్ దిబ్బా, ఎఇ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

జెజెఎం పనులను పరిశీలించిన కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-సీతానగరం

జల జీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తిచేసి ప్రతిఇంటికీ పరిశుభ్రమైన మంచినీరు అందించాలని కలెక్టరు నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సీతానగరం మండలంలో మరిపివలస, అప్పయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న జల జీవన్ మిషన్ పనులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రజల ఆరోగ్యానికి సురక్షితమైన మంచినీరు ఎంతో అవసరమని, జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీటిని సరఫరా చేసే అవకాశం ఏర్పడిందని తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేయాలని నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. లక్ష్యం మేరకు పనులను సకాలంలో పూర్తిచేయాలని, నిధులకు కొరతలేదని చెప్పారు. పనులు నాణ్యంగా పూర్తి చేసి వెంటనే బిల్లులను చెల్లింపుల నిమిత్తం సమర్పించాలని కలెక్టరు తెలిపారు. పెండింగు పనులను వారంరోజులలో పూర్తిచేయాలని ఆదేశించారు.

జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు పనుల పురోగతి గూర్చి వివరించారు. మరిపివలసలో 300, అప్పయ్యపేటలో 430 కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఇంకా 1500 కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ మండల ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుళాయిలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

టిడిపి హామీలు నమ్మొద్దు

సామాజిక సాధికార బస్సుయాత్రలో డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, ముత్యాలనాయుడు

ప్రజాశక్తి - కురుపాం

ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు టిడిపి ఇస్తున్న మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దని డిప్యూటీ సిఎంలు పి.రాజన్నదొర, బి.ముత్యాలనాయుడు కోరారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికారిక బస్సుయాత్ర బుధవారం కురుపాం నియోజకవర్గ కేంద్రంలో జరిగింది. తొలుత నందివానివలస జట్టు ఆశ్రమం నుంచి ప్రారంభమైన బస్సు యాత్రకు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుండి ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీగా కురుపాం చేరుకున్నారు. అనంతరం కురుపాం మేదరవీధి జంక్షన్ వద్ద ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన జరిగిన సభలో రాజన్నదొర మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటున్నది తామేనని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేలకు కనీస గౌరవం ఉండేది కాదన్నారు. గిరిజన ఎమ్మెల్యేలకు కనీసం మంత్రి పదవి దక్కే దాఖలాలు లేవన్నారు. వైసిపి ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ మంత్రితోపాటు ఉపముఖ్యమంత్రి కల్పించిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర యాసలో వంగపండు పాడిన పాట 'ఏం పిల్లడో వెళ్దం వస్తవా' అంటూ ఉత్సాహంగా పాడిన పాట అందరికీ ఆకట్టుకుంది.

సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

అనంతరం డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి దోహదపడే పార్టీ వైసిపియేనని చెప్పారు. నిరుపేదల అభివృద్ధి కాంక్షిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి జనరంజక పాలనకు మరోసారి ఓట్లతో మద్దతు ఇవ్వాలని కోరారు.

అనంతరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో ఉన్న నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ పదవులు అనుభవించి, నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారని తెలిపారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజలు ఆధారాభిమానాలు పొందుతున్నారని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కోరారు.

కార్యక్రమంలో వైసిపి ఉత్తరాంధ్ర కన్వీనర్ వై.వి.సుబ్బారెడ్డి, విజయనగరం, అరకు ఎంపిలు బెల్లాన చంద్రశేఖర్, జి.మాధవి, ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, వి.కళావతి, కంబాల జోగులు, శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఎమ్మెల్సీ పి.సురేష్ బాబు, కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, నెక్కల నాయుడుబాబు, రంగుముద్రి రమాదేవి, శోభా స్వాతిరాణి, నవరత్నాల చైర్మన్ అంకరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను మోసగించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-పాలకొండ

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎన్.హిమప్రభ ఆగ్రహం వ్యక్తంచేశారు. అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుంచి చేపట్టే సమ్మెకు మద్దతుగా బుధవారం పాలకొండలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బి.అమరవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు చెల్లిస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు. అంగన్వాడీలకు గ్రాడ్యుటి ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయలేదని చెప్పారు. కేంద్రాల నిర్వహణకు అంగన్వాడీల జీతం నుంచి పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీ స్కూల్ పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు నాణ్యమైన సరుకులు అందివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అనేక ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పైగా నిర్బంధాలు ప్రయోగిస్తూ పోరాటాలని అణిచివేసే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 8 నుండి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ సెంటర్లు మూసివేసి నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు అంగన్వాడీలకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పలు ప్రజా సంఘాల నాయకులు ఎం.కాంతారావు, కాద రాము, దూసి దుర్గారావు, ఎడ్ల శ్రీనివాసరావు, కె.శారద, ఎం.శ్రీదేవి, ఎం.శ్యామల, మజ్జి వీరంనాయుడు, సిహెచ్ వెంకటరత్నం, ఆర్.ఈశ్వరరావు, ఎన్.సోమేశ్వరరావు కె.శ్యామలరావు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు హిమప్రభ

కొమరాడ : అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు చిరిగి అనురాధ కోరారు. సమ్మెను విజయవంతం చేయాలని కొమరాడ ప్రాజెక్టు వద్ద బుధవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో జయమ్మ, అలివేలు, రాజేశ్వరమ్మ, పద్మ పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ ఉత్సవాల ఆర్గనైజర్‌గా దేవానంద్

గుమ్మలక్ష్మీపురం : డిసెంబర్ 16, 17 తేదీల్లో తాడేపల్లిగూడెంలోని బుద్ధలా కన్వెన్షన్ హాలులో 30 గంటలపాటు నాన్‌స్టాప్‌గా నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య - కళా ఉత్సవాల ఆర్గనైజర్‌గా రచయిత పాలక దేవానంద్ ఎంపికయ్యారు. మండలంలోని మండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా దేవానంద్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రపంచ తెలుగు ఉత్సవాల గాన కచేరి కార్యక్రమాన్ని అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌కు ధన్యవాదాలు తెలిపారు. దేవానంద్ ఎంపిక పట్ల ఏజెన్సీ కవులు పెద్దింటి నిర్మల్, గుమ్మ గోపాల్, ఉమాకవి, రౌతు వాసు, బాలకృష్ణ, హరిప్రసాద్, సర్పంచ్ శంకరావు హర్షం వ్యక్తంచేశారు.

'పొలంబడి' రైతులకు ధ్రువపత్రాలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న రైతులకు ధ్రువపత్రాలు అందిస్తున్నట్లు ప్రకృతి ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ అధికారి ప్రదీప్‌రెడ్డి తెలిపారు. మండలంలో సంతోషపురం గ్రామంలో మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబిస్తూ సాగుచేస్తున్న వరిపొలాలను బుధవారం ఆయన మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. రైతు సాగు పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. రైతుల పంట పరిసరాలను, రైతుల వారిగా నమోదు చేసిన డాక్యుమెంట్లను బృందం పరిశీలించింది. రైతులతో సమావేశం నిర్వహించి పంట ఉత్పత్తుల శాంపిల్స్ సేకరించి, పురుగు మందుల అవశేషాల నిమిత్తం రాష్ట్ర స్థాయి ప్రయోగశాలకు పంపిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఫలితాల ఆధారంగా పొలంబడి రైతులకు ధ్రువపత్రాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు మంచి ధర వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎడి, ఎఒ, విఎఎలు పాల్గొన్నారు.

హామీలు విస్మరించి యాత్రలా? : కాంగ్రెస్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పాలకులు విస్మరించి, సామాజిక సాధికార బస్సు యాత్రలు చేయడమేమిటని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం ప్రశ్నించారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కురుపాం ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో ముందుగా చెప్పాలన్నారు. పేరుకుపోయిన ప్రజా, గిరిజన సమస్యలను పక్కనపెట్టి సాధికార బస్సుయాత్రలను చేయడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. నియోజకవర్గంలో ఏనుగులను తరలించడంలో ప్రభుత్వానికి శ్రద్ధ లేదన్నారు. రేగిడి గెడ్డను వట్టిగడ్డకు అనుసంధానం చేస్తే సుమారు పదివేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఇవేవీ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించినందుకు ప్రజలకు ఏం చెబుతారని నిలదీశారు. సర్పంచుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని, సర్పంచులకు వచ్చిన నిధులను దారి మళ్లించినందుకు సాధికార యాత్ర చేస్తున్నారా? అని ప్రశ్నించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జెసి గోవిందరావు

పట్టుదలతో చదివితే ఫలితాలు

ప్రజాశక్తి-పాచిపెంట

పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివితే రానున్న పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తారని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, హెచ్‌ఎంతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రాజశేఖర్, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సక్రమంగా ఆడిట్ చేపట్టాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-సాలూరు

ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో సోషల్ ఆడిట్ సక్రమంగా చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, మండల కార్యదర్శి తాడంగి గాసి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోషల్ ఆడిట్ బృందాలు లోతుగా అధ్యయనం చేయకుండా తూతూమంత్రంగా తనిఖీ చేస్తున్నట్లు తెలుస్తోందని చెప్పారు. ఉపాధి పనుల్లో చాలా వరకు అవినీతి అక్రమాలు జరిగాయని చెప్పారు. అధికారులతో సోషల్ ఆడిట్ బృందాలు కుమ్మక్కై మొక్కుబడిగా సర్వే చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. సోషల్ ఆడిట్ బృందాలు ఉపాధి కూలీలందరినీ విచారించాలని డిమాండ్ చేశారు.

సత్యవతికి బంగారు పతకం

ప్రజాశక్తి-వీరఘట్టం

నరసారావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ ఖోఖోలో తలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి వంజరపు సత్యవతికి బంగారు పతకం లభించినట్లు ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు తెలిపారు. సత్యవతిని హెచ్‌ఎంతోపాటు గ్రామ సర్పంచ్ సిహెచ్.మధుసూదనరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ, వై.ధనలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

జనసేనంటే వైసిపికి వణుకు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జనసేనంటే అధికార పార్టీకి వణుకు పుడుతోందని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు తెలిపారు. కురుపాంలో సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా మల్లేశ్వరరావును బుధవారం తెల్లవారు జామున 4 గంటలకు ఎల్విన్‌పేట పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఇంకెన్నాళ్లు తమను అరెస్టులు చేసి కార్యక్రమాలు చేపడతారని నిలదీశారు. ఇది ముమ్మాటికీ వైసిపి పిరికిపంద చర్యని అభిప్రాయపడ్డారు.

జగనన్న కాలనీల సందర్శన

ప్రజాశక్తి-గరుగుబిల్లి

జగనన్న కాలనీల్లో ఇళ్ల పరిశీలన నిమిత్తం ఆర్‌డిఒ ఎం.లావణ్య బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో పరిశీలించినట్లు తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి లేఔట్ విషయంలో ఎలాంటి అలసత్వం వహించకుండా పంచాయతీ స్థాయిలో పనులు జరిగేటట్టు వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పైడితల్లి పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

అంగన్వాడీ కేంద్రంలో మెనూ ప్రకారం చిన్నారులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాలని ఎల్విన్‌పేట పంచాయతీ కార్యదర్శి శ్యామల సూచించారు. డోకులగూడ అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లల బరువు, ఎత్తు పరిశీలించారు. పౌష్టికాహారం అందించడం ద్వారా పిల్లలను ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దడానికి వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ ఎన్.పార్వతి, ఎఎన్ఎం కన్య పాల్గొన్నారు.

యువత చేతిలో దేశ భవిష్యత్తు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

దేశ భవిష్యత్తు మార్చేసత్తా యువత చేతి ఓటులోనే ఉందని జనసేన పార్టీ నాయకులు అన్నారు. బుధవారం పార్వతీపురం పట్టణంలోని ఎస్ఎస్ఎస్ కళాశాలలో విద్యార్థులకు జనసేన పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, తామరకండి తేజ తదితరులు ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనే వజ్రాయుధంతో నీతి, నిజాయితీ, విలువలతో కూడిన నాయకుల్ని ఎన్నుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అనంతరావు, అధ్యాపకులు పాల్గొన్నారు..

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపల్ సాధారణ సమావేశం గురువారం చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరుగనుంది. ఈ సమావేశానికి మున్సిపాలిటీకి చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని కమిషనర్ టి.జయరాం ఒక ప్రకటనలో కోరారు.

2, 3న ప్రత్యేక ఓటరు నమోదు

కలెక్టర్‌కు వినతి అందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

డిసెంబరు 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. వచ్చే జనవరి ఒకటో తేదికి 18 ఏళ్లు పూర్తయ్యే యువతీ యువకులను, ఇంతవరకు ఓటరుగా నమోదు కానివారిని ఓటరుగా నమోదు చేయించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన

మాట్లాడుతున్న సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 7,70,525 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వారిలో పురుషులు 3,76,220, స్త్రీలు 3,94,240, థర్డ్ జెండర్ 65 మంది ఉన్నారని తెలిపారు. ఏప్రిల్ 15వ తేది నుండి ఇప్పటివరకు 26,586 మందిని ఓటరు జాబితాలో చేర్చడం, 27789 తొలగింపులు చేయగా, 86930 సవరణలు చేసినట్లు వివరించారు. క్లైములు, అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరిస్తారని, 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో తెలియజేసిన అభ్యంతరాలపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం రోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు ఉంటారన్నారు. బూత్ స్థాయి అధికారుల వద్ద ఫారం - 6, 7, 8 అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఒకేసారి పెద్ద ఎత్తున ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించడం జరగదని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్లపై ప్రజలకు అవగాహన కోసం ప్రత్యేకంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొబైల్ ప్రదర్శన వ్యాన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మొబైల్ ప్రదర్శన వ్యాన్‌తోపాటు ఒక అధికారిని నియమించి, రూట్ చార్ట్ వివరాలను ముందుగా తెలియజేసి ఈ కార్యక్రమానికి ప్రభుత్వపరంగా ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ప్రజలను పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. మరణించిన, శాశ్వతంగా వలసవెళ్లిన, అడ్రసు గుర్తింపబడని ఓట్లను తొలగించాలని టిడిపి ప్రతినిధులు జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశానికి వైసిపి ప్రతినిధి వి.శ్రీనివాసరావు, టిడిపి ప్రతినిధులు జి.సంధ్యారాణి, డి.జగదీష్, బి.విజయచంద్ర, టి.జగదీశ్వరి, జి.వెంకటనాయుడు, బిజెపి ప్రతినిధి ఎ.పేర్రాజు, లోక్‌సత్తా ప్రతినిధి ఎ.ప్రభాకరరావు, జనసేన ప్రతినిధి పి.శీనివాసరావు, బిఎస్‌పి ప్రతినిధి టి.వెంకటరావు పాల్గొన్నారు.

సీతంపేట : బిఎల్‌ఒలు రిజిస్టర్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. బుధవారం నాలుగు మండలాల బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. ఓటు తొలగించేటప్పుడు నిబంధనల ప్రకారం తొలగించాలన్నారు. వలస వెళ్లిన వారి ఓట్ల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు నరసింహమూర్తి, అప్పారావు, డిటిలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి ఐసిడిఎస్ పరిధిలో 98 అంగన్వాడీ కేంద్రాలకు నాడు-నేడు కార్యక్రమంలో నిధులు మంజూరయ్యాయని సిడిపిఒ సిహెచ్.సుశీల దేవి, ఎంపిడిఒ ఎస్.సాల్మన్‌రాజు తెలిపారు. బుధవారం స్థానిక అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాల నాడు-నేడు కమిటీ సభ్యులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒక్కో అంగన్వాడీ కేంద్రానికి మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.90 వేలు , తాగునీటి సౌకర్యానికి రూ.35 వేలు, పెయింటింగ్స్‌కు రూ.25 వేలు , విద్యుతు మరమ్మతుల కోసం రూ.15 వేలు చొప్పున నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో మరమ్మతులు చేపట్టేందుకు తల్లుల కమిటీతోపాటు, అంగన్వాడీ కార్యకర్త కన్వీనర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. ఇంజనీరింగ్ సహాయకులు దగ్గరుండి ఆయా పనులను పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో సూపర్వైజర్లు శ్రీదేవి, ఈశ్వరమ్మ, రేవతి, దౌలత్ వున్నీసా తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో 67 అంగన్వాడీ భవనాల మరమ్మతులకు నాడు-నేడులో నిధులు మంజూరయ్యాయని ఎంపిడిఒ కె.గీతాంజలి తెలిపారు. నాడు-నేడు నిధుల మంజూరుపై బుధవారం వైకెపి భవనంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ భవనాలకు విద్యుత్తు, తాగునీరు, మోటార్, తలుపుల మరమ్మతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు సిడిపిఒ రంగలక్ష్మి మాట్లాడుతూ నాణ్యతగా పనులు చేపట్టి శరవేగంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎఇ సత్యనారాయణ, ఎసిడిపిఒ శాంతకుమారి, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం కురుపాం, జియ్యమ్మవలస మండలాల అంగన్వాడీలకు నాడు-నేడు పనులపై ఐసిడిఎస్, మండల విద్యాశాఖ సంయుక్తంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిఒ కె.విజయగౌరి, ఎంఇఒ ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ మొదట విడతగా 78 అంగన్వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్తు నిమిత్తం నాడు-నేడు కార్యక్రమం ద్వారా నిధులు మంజూరైనట్లు తెలిపారు. గ్రామస్థాయిలో అంగన్వాడీ కేంద్రం మదర్స్ కమిటీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, సూపర్వైజర్ల ద్వారా పనులు చేయాలని వారు సూచించారు.

చిరుధాన్యాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెసి గోవిందరావు

చిరుధాన్యాల కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

రైతులు తమ పంటలను రైతుభరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు అమ్ముకోవాలని జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు తెలిపారు. బుధవారం మండలంలోని సంగంవలన రైతుభరోసా కేంద్రంలో చిరుధాన్యాలు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన సేవలన్నింటిని అందిస్తున్నదని తెలిపారు. రైతు పండించిన పంటకు మద్దతు ధర కల్పించిందన్నారు. రైతుల సమక్షంలో గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం, చిరుధాన్యాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఏ రైతు కూడా తన పంటని కనీస మద్దతుధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేకుండా , దళారులు, మిల్లర్ల చేతిలో నష్టపోకూడదనే ఉద్దేశంతో ధాన్యం, చిరుధాన్యాలు ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తోందని తెలిపారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని ధాన్యం, చిరుధాన్యాలను మద్దతు ధరకు అమ్ముకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి జిల్లా మేనేజరు దేవుళ్ల నాయక్, జిల్లా సప్లయి అధికారి శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అదికారి రాబర్ట్ పాల్, గ్రామ సర్పంచ్ బడే చిట్టినాయుడు, రైతులు పాల్గొన్నారు.

సామాజిక భవనానికి శంకుస్థాపన

మాట్లాడుతున్న ఎమ్‌పి మాధవి

ప్రజాశక్తి-సీతానగరం

సీతానగరంలోని సుంకరవీధిలో తూర్పుకాపు సామాజిక భవన నిర్మాణానికి ఎమ్‌పి జి.మాధవి, ఎమ్మెల్యే ఎ.జోగారావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పి మాధవి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సిఎం జగన్‌కు మద్దతుగా నివాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఎంపిపి బలగ రమణమ్మ, జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, ఎంపిటిసి గౌరీకిరణ్, సర్పంచ్ సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో ఆలయానికి శంకుస్థాపన

పార్వతీపురంరూరల్ : గోపాలపురం గ్రామంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే జోగారావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి ఆయన విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.రమణ, యాదవ సంఘం నాయకుఉల పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎఎంసి చైర్‌పర్సన్ అనంతకుమారి

సరికొత్త పద్ధతిలో చోడి సాగు

ప్రజాశక్తి-పాచిపెంట

ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరి కోతకు వారం రోజుల ముందు నేలలో ఉన్న తేమను వినియోగించుకుని పంట పండించడానికి అపరాలు చల్లుతారు. కానీ, వరి కొయ్యలలో చోడి సాగుకు పి.కోనవలస రైతు భరోసా కేంద్రం పరిధిలో ఉన్న చెరుకుపల్లి గ్రామంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా విత్తనాలను మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన జిల్లాలో వరి కొయ్యలలో చోడి పంట సాగు ఇదే ప్రథమమని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల భూమిలో తేమ శాతం చాలా తక్కువగా ఉందన్నారు. తక్కువ నీటి పదునుతో జిల్లాలోనే ప్రథమంగా వరి కొయ్యలలో చోడి పంట సాగుకు ముందుకు వచ్చినందుకు రైతులకు అభినందనలు తెలిపారు. భూమిని ఖాళీగా ఉంచకూడదని, 365 రోజులపాటు ఏదో ఒక పంటతో కప్పి ఉంచుకోవాలని సూచించారు. అలా అయితే పోషకాలు బయటకు పోకుండా ఉంటాయన్నారు.

ఈ సంవత్సరం రబీ సీజన్లో చిరుధాన్యాల సాగును పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ప్రభుత్వం మంచి మద్దతు ధరను కల్పించిందన్నారు. చిరుధాన్యాల సాగుకు రైతులు ముందుకు రావాలని తెలిపారు. అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకులు నాగమణితో కలిసి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.

రైతులకు చోడి విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎఒ తిరుపతిరావు

గంజాయిభద్రలో 'జగనే ఎందుకు కావాలి'

ప్రజాశక్తి-సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గంజాయిభద్రలో ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ఎంపిడిఒ జి.పార్వతి ఆధ్వర్యాన వైసిపి జెండావిష్కరణ చేశారు. గడచిన నాలుగున్నరేళ్లలో పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెమ్మెల దివాకర్, వైసిపి నాయకులు గెమ్మెల భీషు, పంచాయతీ కార్యదర్శి కె. శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్ లు పాల్గొన్నారు.

బత్తిలిలో..

భామిని : మండలంలోని బత్తిలిలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం ఆధ్వర్యాన ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల లబ్దిదారుల పోస్టర్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో కో -ఆప్షన్ సభ్యులు పట్నాయక్, ఇఒపిఆర్‌డి కృష్ణారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంగంవలసలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

సంగంవలస గ్రామంలో బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.విజయచంద్ర ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. టిడిపిని అధికారంలోకి తీసుకువస్తే చేయబోయే అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోను చంద్రమౌళి, కార్యదర్శి గురజాన చంద్రమౌళి, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట్ నాయుడు మాజీ సర్పంచ్ అమరాపు రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి లో చేరికలు

బందలుప్పి గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.విజయ్‌చంద్ర ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు శంకరాపు శంకరరావు తన అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కష్టపడిన కార్యకర్తలు అదరికీ సముచితంగా గౌరవిస్తామని ఈ సందర్భంగా విజయ్‌చంద్ర తెలిపారు.

యుహెచ్‌సిని సందర్శించిన డిఐఒ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని చర్చివీధిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డిఐఒ టి.జగన్మోహనరావు, డబ్ల్యూహెచ్‌ఒ కన్సల్టెంట్ డి.వంశీ రత్నకుమార్ కలిసి బుధవారం సందర్శించారు. అక్కడ వైద్య సిబ్బందితో సమీక్షించి, టీకాల నిర్వహణపై ఆరాతీశారు. పిపి యూనిట్‌లో వ్యాక్సిన్ నిల్వలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్ఞ, సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న డిఐఒ



బండారుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దత్తి లక్ష్మణరావు

బండారును కలిసిన దత్తి

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు బుధవారం పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. పెందుర్తి నియోజకవర్గ పరిశీలకులుగా లక్ష్మణరావును టిడిపి అధిష్టానం నియమించిన సందర్భంగా సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పరిస్థితి, బలోపేతానికి తీసుకోవలసిన చర్యల గూర్చి చర్చించారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు చందక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల బడ్జెట్‌కు ఆమోదం

సీతానగరం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి బి.రమణమ్మ అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -భామిని

దిమ్మిడిజోల గ్రామానికి చెందిన వలురౌతు మోహనరావు (48) గత ఆదివారం కొబ్బరికాయలు తీసే క్రమంలో జారి పడ్డాడు. తీవ్రంగా గాయాలు కావడంతో కుటుంబసభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కి, అక్కడి నుంచి కెజిహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మోహనరావు మృతి చెందాడు. ఆయనకు భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్ల గ్రామానికి చెందిన ఉప్పు శంకర్రావు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇటీవల గ్రామంలో ఓ వ్యక్తితో శంకరరావుకు మాటామాటా పెరిగి తగాదాకు దారితీసింది. శంకర్రావుకు మద్దతుపలికిన వ్యక్తులు ముందుకు రాకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం వీరఘట్టంలో ఆయన పురుగుల మందు తాగాడు. పోలీస్ స్టేషను ఎదురుగా ఓ కానిస్టేబుల్‌కి శంకరరావు తారసపడ్డాడు. పురుగుల మందు వాసన గమనించిన కానిస్టేబుల్ చికిత్స కోసం ఆయన్ను ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి రిఫర్‌చేశారు. అందుబాటులో 108 వాహనం లేకపోవడంతో ఆటో ద్వారా తరలించారు. ప్రస్తుతం శంకర్రావు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.